# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 01 సంచిక : 88 ప్రకాశం, శనివారం 27- 12 - 2025 పేజీలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## ప్రజలపట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలి!

### డి ఎస్ పి బాలసుబ్రహమణ్యం



**గుడ్లూరు క్రైం కౌంటర్ ప్రతినిధి,** ప్రజల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని డిఎస్పీ సిహెచ్ వి.బాలసుబ్రహమణ్యం అన్నారు. వార్షిక తనిఖీ లో భాగంగా శుక్రవారం ఆయన సందర్శించారు. పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయములో సందర్శించి స్టేషన్ రికార్డ్స్, సీడీ ఫైల్స్ ను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలను చేశారు. అయన వెంట సిఐ మంగారావు, ఎస్సై వెంకట్రావు ఉన్నారు.

## గట్టెక్కేదెలా!

**జిల్లాలో మందగించిన రిజిస్ట్రేషన్లు**

**రూ.287 కోట్లకు రూ.266 కోట్లే వసూలు..లక్ష్యంలో జిల్లా వెనుకబాటు**

**బంగారంపై పెట్టుబడులకు మొగ్గు చూపుతున్న జనం**

**నూరుశాతం సాధనకు కసరత్తులు**

**క్రైం కౌంటర్ న్యూస్ , డిసెంబర్ 26** రిజిస్ట్రేషన్‌శాఖలో గత పదిహేను రోజుల నుంచి రిజిస్ట్రేషన్లు మందగించడంతో అధికారుల్లో గుబులు రేగుతోంది. ప్రధానంగా బంగారం ధరల పెరుగుదలే రిజి స్ట్రేషన్లు తగ్గిపోవడం కారణంగా చెబుతున్నారు. రొయ్యల చెరువు రైతులు నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఇది కూడా రిజిస్ట్రేషన్లపై ప్రభావం చూపు తోంది. దీంతో ఆదాయం పెంచేదెలా అంటూ జిల్లా వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్లు తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ. 412 కోట్లు లక్ష్యం. ప్రతికూల పరిస్థితుల్లోను లక్ష్యాలను సాధించ డానికి ఆ శాఖ కసరత్తులు చేస్తోంది. డిసెంబరు 25వ తేదీ నాటికి జిల్లాలో రూ. 287 కోట్లు ఆదాయం సాధించాల్సి ఉండగా రూ. 266 కోట్లు రాబట్టారు. ఇంకా రూ. 21 కోట్లు ఆదాయ ఆర్జనలో రిజిస్ట్రేషన్ శాఖ వెనుకబడి ఉంది. రాబోయే మూడు నెలల్లో 125 పైబడి ఆదాయం ఆర్జించాల్సి ఉంది. ఇంతటి ప్రతికూల పరిస్థితుల్లోనూ ఓవరాల్‌గా ఇప్పటి వరకు 96.51 శాతం లక్ష్యాలను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ సాధించింది. ఈపాటికే లక్ష్యాలను దాటి వెళ్లిపోవాల్సి ఉండగా వెనుకబాటుతో అధికారుల్లోనూ అలజడి రేగుతోంది. ప్రభుత్వం 22ఏ నిషేధిత జాబి తాల్లోని భూములకు పరిష్కార మార్గాలు చూడ డంతో పాటు, ఇటీవలే వారసత్వ భూములను రూ. 100తోనే రిజిస్ట్రేషన్లు చేసేలా ముందుకొచ్చినా ఆశించినంత మేర రిజిస్ట్రేషన్లు పెరగడం లేదు. అధికారుల్లో అంతర్మథనం.. జూలైలో దూకుడు మీద ఉన్నట్టు కనిపించినా నవంబరు నుంచి భూ లావాదేవీలు అమాంతంగా పడిపోయాయి. ప్రతీరోజు జిల్లాలోని 12 కార్యాల యాల్లో 350 వరకు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు జరు గుతుంటాయి. కొద్దికాలంగా కనీసం 250 రిజిస్ట్రేషన్లు సంఖ్య దాటడం లేదు. దీంతో అధికారుల్లో అంతర్మథనం మొదలైంది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ ఎన్. మాధవి జిల్లా కార్యాలయంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి రికార్డులను తనిఖీలు చేశారు. దాదాపుగా వెయ్యి వరకు రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గిందనే తాను పర్యవేక్షణకు వచ్చినట్టు చెప్పుకొచ్చారు. శాఖాపరంగా ఏమైనా లోపాలున్నాయా? ఇంకా ప్రజలు చేరువ కావాలని, వారి ఇబ్బందులుంటే వేగంగా పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. బంగారు బిస్కెట్లపై పెట్టుబడి దసరా నుంచి బంగారం ధరలు అమాంతంగా పైపైకి వెళుతూ ఆకాశన్నంటుతున్నాయి. దీంతో రియల్ భూమ్‌పై ఎఫెక్టు పడింది. అత్యవసరమైతే తప్ప ఇళ్ల స్థలాలు, ప్లాట్‌లను కొనుగోలు చేయ డంపై సామాన్య, మధ్యతరగతి ప్రజలు కన్నెత్తి చూడడం లేదు. కాసు బంగారం దసరా ముందు వరకు రూ. 60 నుంచి రూ. 70 వేలు ఉండగా, అది రూ. 1.10 లక్షలకు చేరింది. ఇది కూడా రెండు లక్షలకు చేరుతుందన్న అంచనాలు సామాన్య, మధ్యతరగతి ప్రజల్ని బంగారం వైపే మళ్లింప చేస్తున్నాయి. దీంతో బంగారం కొనుగోళ్లు పైనే పెడుతున్నట్టు సమాచారం. చిన్న,చితకా స్థలాలు ఉన్నా కొనుగోలుదారులు లేకపోవడంతో రిజి స్ట్రేషన్ల ఆదాయం పడిపోయింది. సంవత్స రంలో రెట్టింపయ్యే పరిస్థితి బంగారం కుదువపైనే ఉండ డంతో ఈ దిశగానే ఆలోచన సాగుతోంది.

## దేశ ఆర్థిక వ్యవస్థను మార్చేది కమ్యూనిజమే - రావుల వెంకయ్య








**క్రైం కౌంటర్ ప్రతినిధి టి.నాగ బ్రహ్మం కందుకూరు రూరల్,**దేశంలో ఉన్న ఆర్థిక వ్యవస్థను మార్చగలిగేది ఒక్క కమ్యూనిస్టు పార్టీ అని ఏఐకెఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య అన్నారు. శుక్రవారం సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు అధ్యక్షతన సిపిఐ శత దినోత్సవ సమావేశం జరిగింది. ముందుగా సిపిఐ కార్యాలయం నుండి ఎన్టీఆర్ బొమ్మ సర్కిల్ మీదగా పామూరు రోడ్డులో ఉన్న శ్రీ తిరుమల ఫంక్షన్ హాల్ వరకు సిపిఐ శత దినోత్సవ ర్యాలీ జరిగింది. తొలుత సిపిఐ కార్యాలయంలో సిపిఐ నేత వలేటి రాఘవులు సతీమణి వలేటి కోటేశ్వరమ్మ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం రావుల వెంకయ్య మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన నాటి నుండి దేశ ఆర్థిక పరిస్థితులు అతలాకుతలం అవుతున్నాయని ప్రభుత్వ రంగాలన్నీ ప్రైవేట్ పరం చేస్తూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం కాస్తున్నారని ఆయన ఆరోపించారు. తన రాజకీయ లబ్ధి కోసం బిజెపి అనేక కుయుక్తులు పన్నుతూ ప్రజలను మోసం చేస్తూ అధికార దాహంతో దేశ స్థితిగతులను మారుస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఆనాటి స్వాతంత్రోద్యమంలో కమ్యూనిస్టుల పాత్ర ప్రముఖమైనదని, బ్రిటిష్ వారికి మద్దతుగా ఉంటూ వారికి ఊడిగం చేసిన బిజెపి నేడు దేశ స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నామని చెప్పుకోవడం సిగ్గుచేటని ఆయన అన్నారు. ఆర్ఎస్ఎస్ అజెండాతో ముందుకు సాగుతున్న బిజెపి మతోన్మాదంతో దేశంలో కుల, మత విద్వేషాలను సృష్టించటం వారికి వెన్నతో పెట్టిన విద్య అని ఆయన ఆరోపించారు. అలాంటి పరిస్థితులలో దేశ భవిష్యత్తును దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలంటే కేవలం అది కమ్యూనిస్టుల వల్లే అవుతుందని ఆయన అన్నారు. రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు సైతం తమ రాజకీయం కోసం ప్రజలకు మాయమాటలు చెబుతూ బిజెపికి మద్దతు పలుకుతున్నారని ఆయన అన్నారు. వ్యవసాయ రైతు కూలీలకు, బడుగు బలహీన వర్గాల పేద ప్రజలకు పనులు కల్పించి వారిని ఆదుకోవాలని ఆనాడు కమ్యూనిస్టు పార్టీలు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిందని ఆయన తెలిపారు. అయితే ప్రస్తుతం ఆ పేరును సైతం తొలగించి పేద ప్రజల పొట్టను కొట్టే విధంగా ఆపథకం ద్వారా వచ్చే ప్రతి పైసాను బడా బాబులకు వెళ్లేలా జీవోలను తీసుకురావడం జరిగిందని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ విషయం గుర్తించి జీవోను వెనక్కి తీసుకునే విధంగా పోరాటం చేయాల్సిన అవసరం కమ్యూనిస్టులతో పాటు ఇతర పార్టీ నాయకులు, సామాజికవేత్తలకు ఉందని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుత పరిస్థితులలో ప్రజలకు కమ్యూనిస్టులపై పూర్తి నమ్మకం ఉందని భవిష్యత్తులో భారత కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి రావడం జరుగుతుందని తద్వారా దేశ ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా విడతలవారీగా పథకాలను అమలు చేస్తామని చెప్పడం సరికాదని ఆయన అన్నారు. పథకాల తాయిలాలతో ప్రజలను మభ్యపెట్టి పదవులను చేపడుతున్నారని ఆయన అన్నారు. కరేడు ప్రాంత రైతులకు అన్యాయం చేస్తూ ఇండో సోల్ సోలార్ కంపెనీ పేరుతో వారి భూములను అన్యాయంగా లాక్కుంటున్నారని అడ్డు వచ్చిన వారిపై అక్రమ కేసులు బనాయించి బెదిరింపు చర్యలకు చేపడుతున్నారని ఆయన అన్నారు. ఇదేమిటని ఎవరు ప్రశ్నించకుండా ఆయా ప్రాంతాలలో ఎప్పుడూ వినని చట్టాలను తీసుకువస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇది ఇలాగే కొనసాగితే ప్రజలు తిరగబడే పరిస్థితి వస్తుందని, ఇటీవల జరిగిన కరేడు ఉద్యమం ప్రస్తుత ప్రభుత్వానికి హెచ్చరిక అని ఆయన అన్నారు. సిపిఐ శత దినోత్సవ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో వచ్చి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నాను అని అన్నారు. ఈ ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు లాయరు పోకూరు కోటయ్య, కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి వై ఆనందమోహన్, సిపిఐ కార్యవర్గ సభ్యులు నత్త రామారావు, నీలిశెట్టి నరసయ్య, ఏఐవైఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు చేవూరి దుర్గాప్రసాద్ బొజ్జ చంద్రమోహన్ ఏపీ మహిళా సమాఖ్య నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు మెండా శైలజ, ఓలేటి కల్పన సిపిఐ నాయకులు ఉప్పుటూరి మాధవరావు, బొల్లోజుల బాల బ్రహ్మాచారి, కోటేశ్వరరావు, ద్రోణాదుల ఆదినారాయణ, ఆంజనేయులు, సీతారామయ్య, ఏఐటీయూసీ అనుబంధ స్కందపురి పెయింట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జమ్మలమడుగు రవి,అల్లూరి చంద్ర, ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, సిపిఐ కార్యకర్తలు సానుభూతిపరులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రేటర్ అటెన్షన్..! నేడు సీఎం అధ్యక్షతన గ్రేటర్ విజయవాడపై కీలక సమావేశం




**క్రైం కౌంటర్ న్యూస్ , డిసెంబర్ 26** గ్రేటర్ విజయవాడ వ్యవహారం చివరి దశకు చేరింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శనివారం ఉన్నతస్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందోనన్న ఉత్కంఠ అందరిలో నెలకొంది. డిసెంబరు 31లోపు ప్రభుత్వం జీవో ఇవ్వగలిగితే.. అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. గ్రేటర్ హైదరాబాద్ సమయంలో ఇచ్చిన జీవోలో మునిసిపాలిటీలు, కార్పొరేషన్లను తొలగిస్తూ ఆర్డినెన్స్ ఇచ్చారు. గ్రేటర్ విజయవాడలో కొండపల్లి, తాడిగడప మునిసిపాలిటీలను పక్కన పెడితే.. మిగిలినవన్నీ పంచాయితీలే. కాబట్టి ప్రభుత్వం ఆర్డినెన్స్ ఇవ్వటానికి ఎలాంటి అవకాశాలు ఉన్నాయనే అంశంపై చర్చ జరుగుతోంది.

**గ్రేటర్ హైదరాబాద్ దారిలో..**

గ్రేటర్ హైదరాబాద్ పరిధి పెంపు విషయంలో తెలంగాణా ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన జీవో ఎంఎస్ నెంబర్ 264ను జారీ చేసిన అంశాన్ని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెరపైకి తెస్తున్నారు. ఈ అంశం గురించి కలెక్టర్ లక్ష్మీశతో ఆయన చర్చించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధి పెంపునకు సంబంధించి తెలంగాణా ప్రభుత్వం ఇచ్చిన జీవోలు, తర్వాత ఇచ్చిన ప్రొసీడింగ్స్, డివిజన్ల పునర్విభజనకు సంబంధించిన ఆదేశాలను అధ్యయనం చేస్తున్నారు. పంచాయతీలను కూడా తొలగిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ ఇవ్వటానికి ఉన్న అవకాశాలపై జిల్లా పంచాయతీ అధికారి, రాష్ట్ర పంచాయతీ అధికారుల నుంచి సమాచారం సేకరిస్తున్నారు. ప్రభుత్వం ఆర్డినెన్స్ ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చే క్రమంలో ఏడాదిలో గ్రేటర్ విజయవాడ కల సాకారమవుతుంది. లేదంటే కాలాతీతమయ్యే అవకాశం ఉంది. పంచాయతీల తీర్మానాలను కోరిన ఎంఏయూడీ గ్రేటర్ విజయవాడ ప్రతిపాదనల నేపథ్యంలో శుక్రవారం ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ పంచాయతీల తీర్మానాలను కోరారు. గతంలోనే 45 పంచాయతీల తీర్మానాలను తీసుకున్నారు. కొత్తగా మరో 30 పంచాయతీలు ప్రతిపాదించిన నేపథ్యంలో వాటి తీర్మానాలను తీసుకోవడం ఇప్పట్లో అయ్యే పని కాదు. ప్రస్తుతం చాలావరకు పంచాయతీ పాలకవర్గాలు వైసీపీకి చెందినవే. తీర్మానాలను ఇవ్వకపోవచ్చు. కాలాతీతం చేయొచ్చు. అలాగే, జనవరి 1 నుంచి జనగణన మొదలవుతుంది. ఆ సమయానికి కూడా ఇబ్బంది అవుతుంది. మార్చి తర్వాత పంచాయతీ ఎన్నికలు ఉంటాయి. ఎన్నికల కోడ్ దృష్ట్యా అప్పుడేం చేయలేని పరిస్థితి ఉంటుంది. ఎన్నికలు పూర్తయ్యాక గ్రేటర్ చేస్తామంటే ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఊరుకునే పరిస్థితి ఉండదు. ఇవన్నీ గ్రేటర్ విజయవాడకు ప్రతిబంధకాలే.

ఆర్డినెన్స్‌పై ఆశలు విలీన పంచాయతీల నుంచి మళ్లీ తీర్మానాలు తీసుకోవాలంటే డిసెంబరు 31 వరకు మాత్రమే సమయం ఉంది. ఈ నాలుగైదు రోజుల్లో ఆ పని పూర్తికాదు. ఈ నేపథ్యంలో తెలంగాణా ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్ మాదిరిగా ఏపీ ప్రభుత్వం కూడా ఆర్డినెన్స్ జీవో ఇవ్వగలిగితే గ్రేటర్‌కు మార్గం సుగమం అవుతుంది. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రేటర్ ప్రతిపాదిత పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించవచ్చు. స్పెషల్ ఆఫీసర్లతో తీర్మానాలు తేలిగ్గా చేయించవచ్చు. ఈ నేపథ్యంలో ఆర్డినెన్స్ ఇవ్వాలని అధికారులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.





**క్రైమ్ కౌంటర్ న్యూస్.. ప్రకాశం జిల్లా.....** మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మార్కాపురం ట్రాఫిక్ ఎస్ఐ . హెూంగార్డు సిబ్బందికి యూనిఫాం ఏర్పాటు చేయమని చెప్పేసి సంస్థను కోరగా దీనికి కమిటీ సభ్యులు చర్చించి ఈరోజు 13 మంది హెూంగార్డులకు యూనిఫామ్ ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమం గురించి కోశాధికారి తడికమల్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ హెూంగార్డులు ట్రాఫిక్ లో ఎండాకాలంలోనూ వర్షాకాలంలోనూ ట్రాఫిక్ నియంత్రణలో వారు చేసే సేవకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఈరోజు వారికి యూనిఫాం అందజేయడం జరిగింది తెలియజేశారు ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డి, కార్యదర్శి అన్నారాము, చైర్మన్ శ్రీమతి గుంటక వనజాక్షి ,చెన్నారెడ్డి ,పాలెం చెంచయ్య, అనుముల ఆంజనేయులు, డాక్టర్ మహబూబ్ భాష ,గోరంట్ల చిన్న వెంకట్ రెడ్డి,ఆర్ కే జి, బచ్చు సుబ్రహ్మణ్యం, కంచర్ల చెన్న కృష్ణ, %ణ ఎ =%, భాగ్యలక్ష్మి తన్నీరు వెంకటరమణ ,మరికొంత కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది...

# రింగ్ రింగా..!

**ఓఆర్ఆర్, ఐఆర్ఆర్, వెస్ట్ బైపాస్ చుట్టూ గ్రేటర్ ప్రతిపాదనలు**
**ర్యాపిడ్ గ్రోత ఏరియాలను దృష్టిలో ఉంచుకుని కూర్పు**
**ఈ మూడు కీలక రహదారుల మధ్య గ్రామాలన్నీ గ్రేటర్‌లోకి..**
**మారనున్న విజయవాడ రూపురేఖలు.. రాజధానికి దగ్గరి దారి**
**ఓఆర్ఆర్ వెంబడి విలీన ప్రాంతాలు**



**క్రైం కౌంటర్ న్యూస్ :** అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్)తో పట్టణీకరణకు అడుగులు పడే అవకాశాలు ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని గ్రేటర్ విలీన ప్రాంతాన్ని ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఓఆర్ఆర్ చుట్టూ తిప్పారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం జి.కొండూరు మండలంలో కొత్తగా రెండు గ్రామాలను ప్రతిపాదించారు. కడియం పోతవరం, కవులూరును ఎంపిక చేశారు ఇబ్రహీంపట్నం మండలంలో కేతనకొండ, మూలపాడు, నవీపోతవరం, త్రిలోచనాపురం, జమీ మాచవరం గ్రామాలను ఎంపిక చేశారు. కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గం కంకిపాడు మండల పరిధిలో కొత్తగా దావులూరు, గొడవర్రు, కోలవెన్ను, కొణతనపాడు, ప్రొద్దుటూరు గ్రామాలను ప్రతిపాదించారు. ఓఆర్ఆర్ చుట్టూ మొత్తం 12 గ్రామాలను గ్రేటర్ పరిధిలోకి తీసుకొచ్చారు. ఈ ప్రాంతాలు ఓఆర్ఆర్‌ను ఆనుకుని ఉండటం వల్ల భవిష్యత్తులో ఓఆర్ఆర్‌ను కూడా దాటుకుని విజయవాడ విస్తరణ జరిగే అవకాశం ఉంటుంది.

వెస్ట్ బైపాస్‌ను ఆధారంగా చేసుకుని.. గన్నవరం నియోజకవర్గంలో చిన్న అవుటపల్లి నుంచి ఎన్‌హెచ్-16తో అనుసంధానంగా విజయవాడ వెస్ట్ బైపాస్ ప్రారంభమవుతుంది. ఈ వెస్ట్ బైపాస్ వెంబడి ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని గన్నవరం మండలంలో కొత్తగా సూరంపల్లి, తెంపల్లి, వీరపనేనిగూడెం గ్రామాలను, ఉంగుటూరు మండలంలో ఆత్కూరు, పెద్ద అవుటపల్లి గ్రామాలను నిర్దేశించారు. ఇవన్నీ కూడా పశ్చిమ బైపాస్ దాటి ఉన్నాయి. పశ్చిమ బైపాస్‌ను ఆనుకుని ఉన్న గ్రామాలను పెద్దసంఖ్యలో ప్రతిపాదించారు. వీటిలో గన్నవరం మండలంలో కొండపావులూరు, వెదురుపావులూరు, చిన్న అవుటపల్లి, గన్నవరం, పురుషోత్తపట్నం, రామచంద్రాపురం, సావారిగూడెం, నున్న, అంబాపురం, ఫిర్యాది నైనవరం, పాతపాడు గ్రామాలను గ్రేటర్ విలీన ప్రతిపాదిత ప్రాంతాల్లోకి తీసుకొచ్చారు. మైలవరం నియోజకవర్గానికి వస్తే గొల్లపూడి, జక్కంపూడి, తాడేపల్లి, షాబాద, వేమవరం ప్రాంతాలను గ్రేటర్ విలీన పరిధిలోకి తీసుకొచ్చారు.

ఇన్నర్ రింగ్‌రోడ్డు ఆధారంగా.. అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు (ఐఆర్ఆర్) ఉమ్మడి కృష్ణాజిల్లాకు కీలకమైన రహదారి. ఈ ప్రాజెక్టును దృష్టిలో ఉంచుకుని జూపూడి, కొండపల్లి, తుమ్మలపాలెం, మాల్కాపురం, పెనమలూరు, జక్కుల నెక్కలం, కేసరపల్లి, నున్న, నిడమానూరు గ్రామాలను గ్రేటర్ విజయవాడ పరిధిలోకి తీసుకొచ్చారు. ఈ గ్రామాల మీదుగా ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ వెళ్తుంది.

# ఏపీలో వైద్య రంగానికి పీపీపీ మోడల్ అవసరం అన్న కేంద్ర ఆరోగ్య మంత్రి నడ్డా



**క్రైం కౌంటర్ న్యూస్ , డిసెంబర్ 26** ఆంధ్రప్రదేశ్‌లో వైద్య మౌలిక సదుపాయాలను వేగంగా విస్తరించి, సేవల నాణ్యతను పెంచేందుకు ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం విధానాన్ని విస్తృతంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా శుక్రవారం రాష్ట్ర ఆరోగ్య, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఒక లేఖ రాశారు.రాష్ట్రంలోని వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తున్నారంటూ ప్రతిపక్ష వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న తరుణంలో ఈ లేఖ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల వైసీపీ ఈ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టింది. పీపీపీ విధానాన్ని చంద్రబాబు ప్రభుత్వం సమర్థిస్తున్న విషయం తెలిసిందే.దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల రంగాల్లో పీపీపీ విధానం విజయవంతమైందని, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడానికి, వారి నైపుణ్యాన్ని వినియోగించుకోవడానికి ఇది సరైన మార్గమని నడ్డా తన లేఖలో పేర్కొన్నారు. జిల్లా ఆసుపత్రుల ఆధునికీకరణ, కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు, డయాగ్నస్టిక్, డయాలసిస్ సేవలను విస్తరించడంలో పీపీపీ మోడల్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన వివరించారు.పీపీపీ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం భారీగా ఆర్థిక సహకారం అందిస్తోందని నడ్డా తెలిపారు. 'వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ పథకం కింద ప్రాజెక్ట్ వ్యయంలో 80 శాతం వరకు, తొలి ఐదేళ్ల నిర్వహణ ఖర్చులలో 50 శాతం వరకు నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. ఈ నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరిస్తాయని స్పష్టం చేశారు. అలాగే, ప్రాజెక్టుల అధ్యయనానికి 'ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ.5 కోట్ల వరకు సాయం అందిస్తామన్నారు.ఈ పథకాల సమర్థవంతమైన అమలు కోసం రాష్ట్ర ఆరోగ్య శాఖలో ఒక ప్రత్యేక పీపీపీ సెల్‌ను ఏర్పాటు చేయాలని నడ్డా సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానాన్ని వ్యూహాత్మకంగా అమలు చేస్తే, వైద్య రంగంలో గణనీయమైన మార్పులు వస్తాయని, ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఏపీఎస్ఆర్టీసీ లో పనిచేస్తూ వైద్యపరమైన కారణాలతో అనర్హులుగా రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు




**క్రైం కౌంటర్ న్యూస్ , డిసెంబర్ 26** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో పనిచేస్తూ వైద్యపరమైన కారణాలతో అనర్హులుగా తేలిన ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. అలాంటి వారికి ఇతర ప్రభుత్వ శాఖల్లో ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది.ఏపీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత, అంటే 2020 జనవరి 1 నుంచి మెడికల్ అన్‌ఫిట్‌గా నిర్ధారణ అయిన ఉద్యోగులందరికీ ఈ నిర్ణయం వర్తిస్తుంది. అనారోగ్య కారణాలతో ఉపాధి కోల్పోయిన అనేక మంది ఉద్యోగులు, వారి కుటుంబాలకు ఈ ఉత్తర్వుల వల్ల గణనీయమైన భరోసా లభించనుంది.గతంలో ఆర్టీసీలో ఉండగా మెడికల్ అన్‌ఫిట్‌గా తేలితే ఉద్యోగం కోల్పోవాల్సి వచ్చేది. అయితే, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైన నేపథ్యంలో, వారిని కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించి, వారి అర్హతలకు అనుగుణంగా ఇతర శాఖల్లో సర్దుబాటు చేయాలని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ తాజా చర్యతో బాధిత ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగ భద్రత లభించనుంది. ఈ నిర్ణయంపై ఆర్టీసీ ఉద్యోగ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.దీనిపై ఏపీ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పందించారు. ఏపీఎస్ఆర్టీసీ నుంచి ప్రభుత్వ సేవల్లోకి జనవరి 2020 లో విలీనం అయిన ఉద్యోగులు, వైద్యపరంగా విధులకు అనర్హులుగా ప్రకటించబడిన ప్రజా రవాణా శాఖ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుభూతితో పరిశీలించి తగిన చర్యలు ప్రారంభించిందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో వికలాంగుల హక్కుల చట్టం%-%2016 ప్రకారం అర్హత కలిగిన ఉద్యోగులకు ప్రాధాన్యత క్రమంలో ప్రత్యామ్నాయ ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. అవసరమైన మేరకు జిల్లా కలెక్టర్ల సహకారంతో ఇతర ప్రభుత్వ శాఖల్లో కూడా ప్రత్యామ్నాయ ఉద్యోగాల్లో నియామక అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తుందని వివరించారు. ఈ చట్టంలోని నిబంధనల ప్రకారం, ఆమోదించిన జాబితాలోకి రాని వైద్య కారణాల వలన అనర్హులైన ఉద్యోగులకు, ఆర్టీసీ లో అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం మానిటరీ కాంపెన్సేషన్ అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వానికి ఉద్యోగుల పట్ల సానుకూలత ఉందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఎవరూ నష్టపోకుండా చూడటం కూటమి ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగుల జీవన భద్రత, వారి కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో సానుకూల దృక్పథంతో ముందుకు రావడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

# ఏపీలో మెడికల్ కాలేజీల టెండర్ల ప్రక్రియలో బిగ్ ట్విస్ట్

**క్రైం కౌంటర్ న్యూస్ , డిసెంబర్ 26** పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణం విషయం.. ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా ఉన్న సంగతి తెలిసిందే. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాంతో ప్రయోజనాలు ఉన్నాయని ప్రభుత్వం చెప్తుంటే.. ప్రభుత్వ ఆస్పత్రులను కూడా ప్రైవేట్ పరం చేసే ప్రయత్నం చేస్తున్నారంటూ వైసీపీ ఆరోపిస్తోంది. కోటి సంతకాల కార్యక్రమం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడుతోంది. ఈ క్రమంలోనే తొలివిడతగా మార్కాపురం, మదనపల్లె, ఆదోని, పులివెందుల మెడికల్ కాలేజీల నిర్మాణం కోసం ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. ఈ నాలుగు మెడికల్ కాలేజీల నిర్మాణానికి సెప్టెంబర్ 18న టెండర్లు పిలిచారు. అయితే కేవలం ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణానికి మాత్రమే కిమ్స్ ఆస్పత్రి.. టెండర్ దాఖలు చేసిందంటూ వార్తలు వచ్చాయి. అయితే దీనిపై కిమ్స్ యాజమాన్యం క్లారిటీ ఇచ్చింది.

మెడికల్ కాలేజీల టెండర్ల ప్రక్రియలో తాము పాల్గొనలేదని కిమ్స్ యాజమాన్యం క్లారిటీ ఇచ్చింది. ఆదోని మెడికల్ కాలేజీ కోసం టెండర్ వేశామన్న వార్తల్లో నిజం లేదంటూ కిమ్స్ యాజమాన్యం క్లారిటీ ఇచ్చింది. టెండర్లు వేయాలనే ఆలోచనే తాము చేయలేదని కిమ్స్ యాజమాన్యం స్పష్టం చేసింది. అయితే ఇటీవల సీఎం చంద్రబాబుతో జరిగిన సమీక్ష కార్యక్రమంలో.. టెండర్ల ప్రక్రియపై అధికారులు చంద్రబాబుకు అప్‌డేట్ ఇచ్చారు.

రెండు ప్రీబిడ్ సమావేశాల్లో.. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఆరు పాల్గొన్నాయని.. కొందరు ప్రాజెక్టు స్థలాన్ని కూడా సందర్శించాలని చంద్రబాబుకు అధికారులు వివరించారు. అయితే పరిస్థితులు అంచనా వేసేందుకు కొంత గడువు కోరినట్లు సీఎంకు వివరించారు. ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణానికి ఓ సంస్థ ముందుకొచ్చిందని అధికారులు చంద్రబాబుకు తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఆ సంస్థ కిమ్స్ అంటూ వార్తలు వచ్చాయి. అయితే టెండర్లు వేయాలనే ఆలోచనే లేదని కిమ్స్ క్లారిటీ ఇవ్వటం ప్రాధాన్యం సంతరించుకుంది.

తగ్గేది లేదంటున్న చంద్రబాబు..



మరోవైపు పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణంపై వెనుకడుగు వేసేది లేదని చంద్రబాబు చెప్తున్నారు. దేశవ్యాప్తంగా ఈ విధానం అమల్లో ఉందని.. పేదలకు నాణ్యమైన కార్పొరేట్ వైద్యం అందుతుందని చంద్రబాబు చెప్తున్నారు.. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. పీపీపీ విధానంపై వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని స్పష్టం చేశారు.

పీపీపీనే ఉత్తమం అంటున్న కేంద్రం మరోవైపు ఆరోగ్య సేవలు, మెడికల్ కాలేజీల నిర్మాణంలో పీపీపీ విధానం అనుసరించాలని కేంద్రం చెప్తోంది. ఈ విధానంలో చేపట్టే ప్రాజెక్టులకు మూలధన వ్యయంలో 40 శాతం వరకూ , నిర్వహణ వ్యయంలో 25 శాతం వరకు గ్రాంటుగా అందిస్తామని.. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా వెల్లడించారు. మెడికల్ కాలేజీల నిర్మాణం, ఆరోగ్య సేవల రంగంలో కేంద్ర ప్రభుత్వం పీపీపీ విధానాన్ని ప్రోత్సహిస్తోందని, రాష్ట్రం కూడా అందిపుచ్చుకోవాలంటూ.. ఏపీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఆయన లేఖ రాయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# బీసీ స్కాలర్‌షిప్‌లకు రూ. 90. 50 కోట్లు మంజూరు

**క్రైం కౌంటర్ న్యూస్ , డిసెంబర్ 26** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ విద్యా సంస్థల్లో చదువుతున్న బీసీ విద్యార్థుల కోసం రూ.90.50 కోట్ల స్కాలర్‌షిప్ నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. 2025-26 విద్యా సంవత్సరానికి గానూ పోస్ట్ మెట్రిక్ రెండో విడతకు రూ.69.40 కోట్లు, ప్రీ మెట్రిక్ రెండో విడతకు రూ.21.10 కోట్లు స్కాలర్‌షిప్ నిధులు కేటాయించినట్లు మంత్రి సవిత తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల బీసీ విద్యార్థులు విద్యకు దూరం కాకుండా చూడటమే తమ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

# సినిమా




## ఛాంపియన్ సక్సెస్ మీట్‌లో రోషన్

స్వప్న సినిమాస్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ ఛాంపియన్. ఈ చిత్రంలో రోషన్, అనస్వర రాజన్ లీడ్ రోల్స్ పోషించారు. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్ సమర్పణలో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్‌తో కలిసి నిర్మించారు. ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ అందుకొని సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ పీపుల్స్ ఛాంపియన్ సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సక్సెస్ మీట్ లో హీరో రోషన్, హీరోయిన్ అనస్వర రాజన్ ఆసక్తికర కామెంట్స్ చేశారు.

పీపుల్స్ ఛాంపియన్ సక్సెస్ మీట్ లో హీరో రోషన్ మాట్లాడుతూ.. మీడియా అందరికీ థాంక్యు సో మచ్. ఛాంపియన్ సినిమా నాకు చాలా స్పెషల్. ఈ ప్రాజెక్టుకి నేను ఎమోషనల్ అటాచ్ అయ్యాను. స్వప్న అక్క నాకు ఎంతగానో సపోర్ట్ చేసింది. తనకి సినిమా అంటే చాలా పాషన్ సినిమా కోసం ఏమైనా చేస్తుంది. కిరణ్ గారికి థాంక్యూ, అలాగే జీకే గారికి, మా నిర్మాతలు అందరికీ థాంక్యూ సో మచ్. కళ్యాణ్ చక్రవర్తి గారితో నటించడం ఒక గౌరవంగా భావిస్తున్నాను. ఇప్పటినుంచి ఆయన నటన కొనసాగించాలని కోరుకుంటున్నాను. ఆయన ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. ఆయన మాకు ఒక ఇన్స్పిరేషన్. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను, మిక్కీ గారు బ్లాక్బస్టర్ ఆల్బమ్ ఇచ్చారు. ఆయన పాటలే చాలా పెద్ద ఎత్తున ప్రమోషన్స్ చేసుకుంటూ వెళ్లాయి. ఆయన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అదిరిపోయింది. అనస్వర చాలా అద్భుతంగా పెర్ఫార్మ్ చేసింది. తనతో మళ్ళీ కలిసి పనిచేయాలని ఉంది. ఈ సినిమాని ఇండస్ట్రీలో చాలా మంది సపోర్ట్ చేశారు. అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఛాంపియన్ ఎప్పటికీ నాకు స్పెషల్ ఫిలిం. నాకు ఈ స్క్రిప్ట్ ఇచ్చిన ప్రదీప్ గారికి థాంక్యూ. ఈ సినిమాకి పనిచేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఈ సినిమా మా అందరికీ స్పెషల్. ఇది ఫ్యామిలీ మూవీ. అందరూ కూడా ఫ్యామిలీతో కలిసి వెళ్లి చూడాలని కోరుకుంటున్నాను అని రోషన్ అన్నారు. .

హీరోయిన్ అనస్వర రాజన్ మాట్లాడుతూ.. సినిమాకి అద్భుతమైన విజయాన్ని ఇచ్చి మమ్మల్ని ఛాంపియన్స్ చేసిన ఆడియన్స్ కి థాంక్యూ. ఛాంపియన్ నా మొదటి తెలుగు సినిమా. థియేటర్స్ లో కూర్చుని ఆడియన్స్ రియాక్షన్ చూస్తున్నప్పుడు చాలా ఆనందంగా అనిపించింది. ఇలాంటి ఎక్స్పీరియన్స్ ని నేను గతంలో ఎప్పుడూ చూడలేదు. గిరగిరా నా ఫేవరెట్ సాంగ్. మిక్కీ గారు అద్భుతమైన ఆల్బమ్ క్రియేట్ చేశారు. చంద్రకళ పాత్ర ఇచ్చిన ప్రదీప్ అన్నకి థాంక్యూ. సప్న గారి సపోర్ట్ కి థాంక్యూ. సినిమాకి ఇంత మంచి విజయాన్ని ఇచ్చిన ఆడియన్స్ అందరికీ థాంక్యూ.. అని అనస్వర రాజన్ తెలిపింది.






## మొలకెత్తిన ఉల్లిపాయలు తినొచ్చా? ఒకవేళ తింటే ఏమవుతుంది.

దాదాపు ప్రతి ఇంటి వంటగదిలో ఉల్లిపాయలు కనిపిస్తాయి. శాఖాహారుల నుంచి మాంసాహారుల వరకు అందరూ ఉల్లిపాయలు తింటారు. ఎందుకంటే ఉల్లిపాయలు లేకుండా ఏ వంట పూర్తికాదు. అంతేకాదు ఇవి లేనితే వంటలకు రుచి కూడా రాదు. అందుకే చాలా మంది వీటిని అధిక మొత్తంలో మార్కెట్లో కొనుగోలు చేసి ఇంట్లో నిల్వ చేసుకుంటూ ఉంటారు. కానీ ఎక్కువ రోజులు నిల్వ ఉంచడం వల్ల ఉల్లి మొలకెత్తడం చూస్తూనే ఉంటాం. ఇలా మొలకెత్తిన ఉల్లిని తినడం సురక్షితమేనా అనే సందేహం చాలా మందికి ఉంటుంది. ఈ విధంగా మొలకెత్తిన ఉల్లిపాయలను తినకూడదని కొందరు భావిస్తుంటారు. కానీ మరికొందరు మాత్రం మొలకెత్తిన ఉల్లి ఆరోగ్యానికి చాలా మంచిదని, దీనిని తినడంలో ఎటువంటి సమస్య లేదని చెబుతున్నారు. నిజానికి.. మొలకెత్తిన ఉల్లి తినడం మంచిదా? కాదా? అనే విషయం నిపుణులు మాటల్లో ఇక్కడ తెలుసుకుందాం..

నిల్వ ఉల్లిపాయలకు వచ్చే పచ్చి మొలకలు విషపూరితమైనవి కావు. నిజానికి ఉల్లిపాయ పాతబడి కొంత తేమను పొందినప్పుడు అది మళ్ళీ మొలకెత్తడం ప్రారంభమవుతుంది. రోజులు గడిచేకొద్దీ దాని నుంచి పచ్చని ఆకు ఉద్భవిస్తాయి. ఈ ఆకులు తినడం ఆరోగ్యానికి మంచిది. భయపడాల్సిన అవసరం లేదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. కానీ ఉల్లిపాయలు తినడానికి సురక్షితమే అయినప్పటికీ వాటి లక్షణాలలో కొన్ని మార్పులు సంభవిస్తాయి. ఉల్లిపాయలు మొలకెత్తినప్పుడు, లోపలి భాగం కొద్దిగా మృదువుగా, లేతగా మారుతుంది.

ఈ ఉల్లిపాయలు సాధారణ ఉల్లిపాయల మాదిరిగా రుచిగా ఉండకపోవచ్చు. వాటికి కొంచెం చేదు రుచి ఉంటుంది. మీరు వంట చేసేటప్పుడు మొలకలను కోసి సలాడ్లు వంటి ఇతర ఆహారాలలో వాడవచ్చు. వాటిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. వాటిని తినడం ఆరోగ్యానికి కూడా మంచిది. కానీ మొలకెత్తిన ఉల్లిపాయ నొక్కినప్పుడు చాలా మృదువుగా లేదా పొడిగా ఉంటే, అలాగే వాటిపై నల్ల మచ్చలు ఉంటే అలాంటి వాటిని ఉపయోగించవద్దు. ఇటువంటి ఉల్లిపాయలు ఆరోగ్యానికి ప్రమాదకరమని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.



## డయాబెటీస్ రోగులు చిలగడ దుంపలు తినడం మంచిదేనా.

ఈ మధ్యకాలంలో చాలా మంది ఎదుర్కొంటున్న ప్రధాన ఆరోగ్య సమస్యలలో డయాబెటీస్ కూడా ఒకటి. ఈ సమస్యను పరిష్కరించుకోవాలంటే.. సరైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. అయితే ఈ సమ్యను నియంత్రించడం కోసం చాలా మంది బయట మందులను వాడుతుంటారు. కానీ మన రోజువారీ ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా దీన్ని ఈజీగా నియంత్రించవచ్చని చాలా మందికి తెలియదు. అవును చిలకడదుపంను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఈ వ్యాధిని నియంత్రించవచ్చుట. దీనిలో ఉండే గ్లైసెమిక్ ఇండెక్స్ డయాబెటిస్ ను నియంత్రించడంలో సహాయపడుతుందట. గ్లైసెమిక్ ఇండెక్స్ అనేది ఒక శాస్త్రీయ స్కేల్, ఇది ఒక ఆహారం తిన్న తర్వాత మన రక్తంలో చక్కెర స్థాయిలను ఎంత త్వరగా పెంచుతుందో కొలుస్తుంది. దీని స్కోరు 0 నుండి 100 వరకు ఉంటుంది. తక్కువ (55 లేదా అంతకంటే తక్కువ) ఉన్న ఆహారాలు రక్తంలోకి నెమ్మదిగా గ్లూకోజ్‌ను విడుదల చేస్తాయి, ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. అయితే, అధిక (70 కంటే ఎక్కువ) ఉన్న ఆహారాలు వేగంగా పెరుగుదలకు కారణమవుతాయి. పోషకాహార నిపుణుడు అవ్ని కౌల్ ప్రకారం, “తక్కువ ఎంపికలను ఎంచుకోవడం మధుమేహ నిర్వహణకు సురక్షితం.

చిలగడదుంప గ్లైసెమిక్ స్కోరుచిలగడదుంపలలో సగటు 44 నుండి 61 వరకు ఉంటుంది, ఇది వాటిని మీడియం- వర్గంలో ఉంచుతుంది. అయితే మనం వాటిని ఎలా ఉగికిస్తున్నామనే దానిపై దాని జీఐ స్కోర్ ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు, కాల్చిన చిలగడదుంపలు ఉడికించిన చిలగడదుంపల కంటే కొంచెం ఎక్కువ కలిగి ఉంటాయి. 150 గ్రాముల ఉడికించిన చిలగడదుంపలో దాదాపు 27 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 4 గ్రాముల ఫైబర్, మీ రోజువారీ తీసుకోవడంలో 400 శాతం విటమిన్ ఎ, విటమిన్ సి, పొటాషియం, మెగ్నీషియం ఉంటాయి. ఇందులో బీటా-కెరోటిన్ కూడా ఉంటుంది, ఇది ఆక్సీకరణ ఒత్తిడి, వాపును తగ్గించే యాంటీ ఆక్సిడెంట్. మధుమేహ వ్యాధిగ్రస్తులు చిలగడదుంపలను ఎలా తినాలి రోజువారీ వ్యాయామం, సమతుల్య ఆహారంతో పాటు తగిన మొత్తంలో తిన్న చిలగడదుంపలు మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రయోజనకరంగా ఉంటాయని పరిశోధనలు సూచిస్తున్నాయి.

## హాఫ్ సెంచరీతో షెఫాలీతో బీభత్సం.

తిరువనంతపురం వేదికగా జరిగిన మూడవ టీ20 మ్యాచ్‌లో భారత మహిళల జట్టు సర్వశక్తులూ ఒడ్డి శ్రీలంకను ఓడించింది. అటు బౌలింగ్‌లోనూ, ఇటు బ్యాటింగ్‌లోనూ తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించి 8 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని నమోదు చేసింది.

బౌలర్ల విజృంభణ %-% కుప్పకూలిన లంక..

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక జట్టుకు భారత పేసర్ రేణుకా సింగ్ ఠాకూర్ చుక్కలు చూపించింది. పవర్‌ప్లేలోనే కీలక వికెట్లు తీసి లంకను కోలుకోలేని దెబ్బ తీసింది. రేణుకా 4 ఓవర్లలో కేవలం 21 పరుగులు ఇచ్చి 4 వికెట్లు పడగొట్టింది. మరోవైపు స్టార్ స్పిన్నర్ దీప్తి శర్మ 3 వికెట్లతో చెలరేగింది. ఈ క్రమంలోనే టీ20ల్లో 150 వికెట్లు తీసిన తొలి భారత ప్లేయర్‌గా ఆమె చరిత్ర సృష్టించింది. వీరిద్దరి ధాటికి శ్రీలంక 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి కేవలం 112 పరుగులు మాత్రమే చేయగలిగింది.

షఫాలీ వర్మ 'మారణహోమం'..

113 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు షఫాలీ వర్మ వీరోచిత ఆరంభాన్ని ఇచ్చింది. మొదటి ఓవర్ నుంచే లంక బౌలర్లపై ఎదురుదాడికి దిగిన షఫాలీ, మైదానాన్ని బౌండరీలతో హోరెత్తించింది. కేవలం 42 బంతుల్లోనే 11 ఫోర్లు, 3 భారీ సిక్సర్ల సాయంతో 79 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. ఆమె స్ట్రైక్ రేట్ (188.09) చూస్తే లంక బౌలర్లను ఆమె ఎంతలా ఆడుకుందో అర్థం చేసుకోవచ్చు.

భారత్ ఘన విజయం..

షఫాలీ ధాటికి భారత్ కేవలం 13.2 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసి లక్ష్యాన్ని అందుకుంది. స్మృతి మంధాన త్వరగానే అవుట్ అయినప్పటికీ, షఫాలీ జోరుతో భారత్ ఎక్కడా తడబడలేదు. ఈ విజయంతో భారత్ 5 మ్యాచ్‌ల సిరీస్‌ను మరో 2 మ్యాచ్‌లు ఉండగానే 3-0 తేడాతో కైవసం చేసుకుంది.

క్లినికల్ పర్ఫార్మెన్స్..

ఈ విజయంలో బౌలర్లు వేసిన పునాదిని బ్యాటర్లు సద్వినియోగం చేసుకున్నారు. ముఖ్యంగా ఫీల్డింగ్‌లో కూడా భారత క్రీడాకారిణులు చురుగ్గా కదిలి లంక బ్యాటర్లపై ఒత్తిడి పెంచారు. ఈ విజయంతో భారత జట్టు సిరీస్‌లో తన ఆధిపత్యాన్ని చాటుకుంది.



## ప్రపంచ రికార్డుతో చెలరేగిన దీప్తి శర్మ.

టీమ్ ఇండియా స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ తన కెరీర్‌లో మరో అరుదైన మైలురాయిని అందుకుంది. శ్రీలంకతో శుక్రవారం జరిగిన మూడవ టీ20 మ్యాచ్‌లో ఆమె అద్భుతమైన బౌలింగ్‌తో చరిత్ర సృష్టించింది. కేవలం 18 పరుగులు ఇచ్చి 3 కీలక వికెట్లు తీయడం ద్వారా, అంతర్జాతీయ టీ20ల్లో 150 వికెట్ల మార్కును అందుకున్న మొట్టమొదటి భారత ప్లేయర్‌గా నిలిచింది.

ప్రపంచ రికార్డు సమం..

ఈ మ్యాచ్‌లో 3 వికెట్లు తీయడంతో దీప్తి శర్మ మొత్తం వికెట్ల సంఖ్య 151కి చేరింది. తద్వారా ఆస్ట్రేలియా పేసర్ మేగాన్ షట్ (151 వికెట్లు) పేరిట ఉన్న 'మహిళల టీ20ల్లో అత్యధిక వికెట్లు' అనే ప్రపంచ రికార్డును దీప్తి సమం చేసింది. అంతేకాకుండా, అంతర్జాతీయ టీ20ల్లో 1000 పరుగులు, 150 వికెట్లు తీసిన ఏకైక క్రికెటర్‌గా (పురుషుల క్రికెట్‌లో కూడా ఎవరికీ ఈ రికార్డు లేదు) సరికొత్త చరిత్ర లిఖించింది.

రేణుకా సింగ్ నిప్పులు చెరిగే బౌలింగ్..

మరోవైపు, భారత పేసర్ రేణుకా సింగ్ ఠాకూర్ ఈ మ్యాచ్‌లో లంక టాప్ ఆర్డర్‌ను దెబ్బతీసింది. గత కొన్ని మ్యాచ్‌లుగా ఆశించిన స్థాయిలో రాణించని రేణుకా, ఈ మ్యాచ్‌లో తిరిగి ఫామ్‌లోకి వచ్చింది. కేవలం 21 పరుగులు ఇచ్చి 4 వికెట్లు పడగొట్టి శ్రీలంక బ్యాటింగ్ వెన్నెముకను విరిచింది. ఆమె వేసిన స్వింగ్ బంతులకు లంక బ్యాటర్ల దగ్గర సమాధానం లేకపోయింది.

తక్కువ స్కోరుకే లంక పరిమితం..

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక జట్టు, భారత బౌలర్ల ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి కేవలం 112 పరుగులు మాత్రమే చేయగలిగింది. లంక బ్యాటర్లలో ఇమేషా దులాని (27), హసిని పెరీరా (25) మాత్రమే కాస్త ప్రతిఘటించారు. కెప్టెన్ చామరి ఆటపట్టు (3)ను దీప్తి శర్మ త్వరగానే పెవిలియన్ పంపడంతో లంక కోలుకోలేకపోయింది.

ప్రస్తుతం దీప్తి శర్మ ఉన్న ఫామ్ చూస్తుంటే, వచ్చే మ్యాచ్‌ల్లో మేగాన్ షట్ రికార్డును అధిగమించి ప్రపంచంలోనే నంబర్ వన్ టీ20 బౌలర్‌గా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే వన్డే ప్రపంచకప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచిన దీప్తి, ఈ ఏడాది ఐసీసీ అవార్డుల రేసులోనూ ముందంజలో ఉంది.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H.No. 1-94, Nekunampuram, Pokur, Prakasam, Andhra Pradesh - 523113. Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2843. Ph:9849707349 email:kvp6858@gmail.com